


# కరపత్రం

SINCE 2014

శనివారం మార్చి 08 2025 | సంపుటి :0 | సంచిక : 145 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4

## బీసీలపై చిత్తశుద్ధి ఉంటే బీఆర్ఎస్ పార్టీ ప్రెసిడెంట్ పదవి బీసీలకు ఇవ్వాలి

**ఈటలను వేధించి ఎందుకు బటయకు పంపారు బీసీలపై కవిత మాటలు దయ్యాలు వేదాలు వల్లించినట్లుంది : ఎంపీ రఘునందన్‌రావు**



రాజకీయ లబ్ధికోసం బీసీలపై ప్రేమ ఉన్నట్టు ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతున్నారు.. తప్ప బీసీలకు అన్యాయం చేసింది బీఆర్ఎస్ పార్టీనేనని ఎంపీ రఘునందన్‌రావు విమర్శించారు. కవితకు బీసీలపై చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్‌తో మాట్లాడి పార్టీ ప్రెసిడెంట్ పదవి బీసీకి ఇప్పించాలని కవితకు సవాల్ విసిరారు. బీసీలకు అన్యాయం జరిగిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని విమర్శలు చేశారు. గజ్వేల్ పట్టణంలో శుక్రవారం మెదక్ ఎంపీ రఘునందన్ రావు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడారు. శాసనసభలో పార్టీ ప్రతిపక్ష నాయకుడిని బీసీ నేతకు ఇవ్వండి.

# 'దక్షిణాదిపై భాజపా కక్ష'..

## డీలిమిటేషన్‌పై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

**దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రంలో అధికారంలో ఉన్న భాజపా కక్ష గట్టిందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు.**



దిల్లీ: డీలిమిటేషన్ అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దక్షిణాది రాష్ట్రాలపై ప్రతీకారం తీర్చుకోవడానికే కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ నియోజకవర్గాల పునర్విభజన చేపడుతోందని విమర్శించారు. ఈ అంశంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డీలిమిటేషన్‌పై తమిళనాడు నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతున్న వేళ 'ఇండియా టుడే' నిర్వహించిన కాన్‌క్లేవ్‌లో రేవంత్ రెడ్డి శుక్రవారం మాట్లాడారు.

"దక్షిణాదిలో భాజపాకు తగిన ప్రాతినిధ్యం లేదు. మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటికీ.. ఆ పార్టీ సాధించిన 240లో దక్షిణాదిలో గెలిచింది కేవలం 29 స్థానాలే. దక్షిణాదిలోని ఏ ఒక్క రాష్ట్రంలో కూడా ఆ పార్టీ అధికారంలో లేదు. ఏపీలో జూనియర్ భాగస్వామిగా ఉంది. అందుకే ప్రతీకారం తీర్చుకోవాలని భాజపా భావిస్తోంది. ఉత్తరాది రాష్ట్రాలకు మేలు చేకూర్చేలా డీలిమిటేషన్‌కు సిద్ధమవుతోంది" అని రేవంత్ రెడ్డి అన్నారు.

కేంద్రం ఆదేశాల మేరకే తాము (దక్షిణాది రాష్ట్రాలు) కుటుంబ నియంత్రణను సమగ్రంగా అమలు చేశామని రేవంత్ రెడ్డి అన్నారు. మరో 30ఏళ్లు డీలిమిటేషన్ ప్రక్రియను వాయిదా వేయాలని, అప్పుడు దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా ఏవిధంగా పెరుగుతుందో చూడాలన్నారు. జనాభా ప్రాతిపదికన కాకుండా ప్రో రేటా విధానంలో సీట్ల పెంపు చేపడితే యూపీలో ప్రస్తుతం ఉన్న 80 సీట్లు 120కి పెరుగతాయన్నారు. తమిళనాడులో 39 నుంచి 60కి మాత్రమే చేరుతాయని అభిప్రాయపడ్డారు. కేవలం దక్షిణాదిలోనే కాదని ఉత్తరాదిలోని పంజాబ్ వంటి రాష్ట్రాలకూ డీలిమిటేషన్ వల్ల నష్టం జరుగుతుందని రేవంత్ రెడ్డి అన్నారు. యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి బిమారీ రాష్ట్రాలకు మాత్రమే దీంతో లబ్ధి జరుగుతుందని తెలిపారు.



2 లో

పెంచాల్సిన వేతనాలు తగ్గించడమా..

## ఇదేం పాలన?:

సీఎం రేవంత్‌రెడ్డిని ఇదేం పాలన అని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు.



## కళ్లెదుట జలదోపిడీ

**జరుగుతున్నా స్పందించరా..?**

ఇంత మొద్దునిద్ర సీఎంను నేనెప్పుడూ చూడలేదు : హరీశ్‌రావు

2 లో

# అర్హులకు రేషన్‌కార్డులు ఇస్తాం : మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి




అర్హులైన వారికి తప్పకుండా రేషన్ కార్డులు ఇస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాతో మాట్లాడారు. పేదవారి ప్రభుత్వం కావాలని ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకుని 15 నెలలు అయ్యిందని తెలిపారు. ఎన్నికల ముందు తాము ఇచ్చిన హామీలను కొన్ని పూర్తి చేశాం, మిగిలిన వాటిని కూడా త్వరలోనే పూర్తి చేస్తామని పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గానికి 3500 ఇళ్లను ఇచ్చే కార్యక్రమం వారంలో ప్రారంభమవుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 2లో

## ఎమ్మెల్సీ సీటు కోసం కాంగ్రెస్‌లో ఆశావహుల ఆశలు

**5 ఎమ్మెల్సీ స్థానాలకు 20వ తేదీన పోలింగ్ కాంగ్రెస్‌కు నాలుగు ఎమ్మెల్సీలు దక్కే అవకాశం సామా రామ్మోహన్ రెడ్డికి ఇచ్చే అవకాశం**



2లో

## పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు..

### కేంద్రంపై ఒత్తిడికి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్: కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలపై ఒత్తిడి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులను కలిసి మెట్రో విస్తరణ, మూసీ పునరుజ్జీవనం, ఆర్‌ఆర్‌ఆర్ తదితర అంశాలపై విన్నవించారు.



2లో

# మహిళల ఆర్థికాభివృద్ధి ప్రత్యేక చర్యలు

## మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు : మంత్రి సీతక్క

**మహిళలను వ్యాపారులను చేసేందుకు ప్రణాళికలు**



మహిళల ఆర్థికాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటుందని, అన్ని రంగాల్లో మహిళలకు ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. పెట్రోల్ పంపులు, ఆర్టీసీ అద్దె బస్సులను మహిళా సంఘాలకు కేటాయిస్తున్నామని స్పష్టం చేశారు. అదానీ అంబానీలకు ఫలితమైన సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఆడబిడ్డలకు అందిస్తున్నామని ఉద్ఘాటించారు. త్వరలో మరిన్ని వ్యాపారాల్లోకి మహిళా సంఘాలను ప్రోత్సహించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టామని తెలిపారు. మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం యూసఫ్ గూడా లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ ప్రాంగణంలో మహిళా సాధికారత యాక్షన్ ప్లాన్ వర్క్ షాప్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి సీతక్క, సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్, విద్యార్థులు, సిబ్బంది, సెర్ప్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్, ఏపీఎంలు హాజరయ్యారు. ప్రగతికి చిహ్నంగా మొక్కలకు నీరు పోసి వర్క్ షాప్‌ను సీతక్క ప్రారంభించారు. పారిశ్రామిక రంగంలో



జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన పలువురు ప్రముఖులను మంత్రి సీతక్క సన్మానించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడారు. అన్ని రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు సమాన వేతనాలు ఉండాలన్న లక్ష్యంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.మహిళల కష్టానికి తగిన ఫలితం ఉండాలన్నదే మహిళా దినోత్సవ ఆవిర్భావానికి కారణంగా నిలిచింది. 2లో

# బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకులపై కేసీఆర్ సమీక్ష

**ఏప్రిల్ 27న జరిగే వేడుకలపై ప్రత్యేక సమావేశం**

**పార్టీ ముఖ్యనేతలకు దిశానిర్దేశం**



బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ రజతోత్సవ వేడుకలపై పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. ఏప్రిల్ 27న జరగబోయే బహిరంగ సభపై పార్టీ నేతలతో కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆవిర్భావ రజతోత్సవ వేడుకలపై పార్టీ నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ రజతోత్సవ వేడుకలపై పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. 2లో

# సంపాదకీయం

## ఈ అనిశ్చితి పోయేదెలా?

జనవరి 20న గద్దెనెక్కినప్పటినుంచీ అధిక టారిఫ్‌లపై హెచ్చరిస్తూ వచ్చిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్... చివరికి అందుకు తుది గడువు ఖరారు చేశారు. తమ ఉత్పత్తులపై అధిక టారిఫ్‌లు వసూలు చేస్తున్న దేశాలన్నీ వచ్చే నెల 2 నుంచి తమ దెబ్బ కాచుకోవాలని హెచ్చరిక జారీచేశారు. దాదాపు వంద నిమిషాలపాటు అమెరికన్ కాంగ్రెస్‌నుద్దేశించి బుధవారం ఆయన చేసిన ప్రసంగం నిండా ఇలాంటి హెచ్చరికలున్నాయి. ఇప్పటికే చాలా సాధించినట్టు స్వోత్కర్షలున్నాయి. అమెరికా ప్రజల పాలిట తాను ఆపద్బాంధవుడినన్న భ్రమ కూడా ఆయనకు పుష్కలంగా ఉంది. 'నేను విధించబోయే సుంకాలు కేవలం ప్రజానీకం ఉద్యోగాలు కాపాడటానికి మాత్రమే కాదు... ఈ చర్య మన దేశ ఆత్మను కాపాడటానికి కూడా' అని ఆయన చెప్పుకొచ్చారు. సహజంగానే ప్రపంచమంతా ఏప్రిల్ గురించి బెంగపడుతోంది. ముంచుకొచ్చే ద్రవ్యపరమైన అసమతౌల్యతను అధిగమించడమెలాగో తెలియక అయోమయంలో కూరుకుపోతోంది. ఇప్పటికే ట్రంప్ చైనాపై అదనంగా 10 శాతం, మెక్సికో, కెనడాలపై మరో 25 శాతం సుంకాలు ప్రకటించటం వల్ల ఈ ఉపద్రవం ఖాయమని అన్ని దేశాలూ ఆందోళనతో ఉన్నాయి. సుంకాలను ట్రంప్ 'సర్వరోగ నివారిణి'గా భావిస్తున్నారు. మెక్సికో మాదకద్రవ్య ముఠాల నుంచి పెద్ద యెత్తున వచ్చిపడే ఫెంటానిల్ అమెరికాకు పెద్ద సమస్యగా మారింది. అక్రమ వలసలు దీనికి అదనం. వలసలను అరికట్టి, మాదకద్రవ్య ముఠా నాయకుల్ని పట్టి అప్పగించకపోతే 25 శాతం సుంకాలు తప్పవని గత నెల 4న ట్రంప్ హెచ్చరించటంతో కెనడా, మెక్సికోలు ఒక నెల వ్యవధి కోరాయి. మెక్సికో అధ్యక్షురాలు షీన్‌బామ్ వెనువెంటనే అమెరికా–మెక్సికో సరిహద్దుల్లోకి అదనంగా 10,000 మంది సైనికులను తరలించి తనిఖీలు పెంచి వలసలను నియంత్రించారు. దేశంలో ఫెంటానిల్ నిల్వలను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేయటంతోపాటు భారీయెత్తున అరెస్టులు చేయించారు. 29 మంది డ్రగ్స్ ముఠా నాయకుల్ని అమెరికాకు అప్పగించారు. కెనడా అధ్యక్షుడు ట్రూడో ఫెంటానిల్ సరిహద్దులు దాటకుండా తనిఖీ వ్యవస్థను ముమ్మరం చేశారు. అయినా ట్రంప్ మనసు మారలేదు.

ఆ రెండు దేశాలపై 25 శాతం అదనపు సుంకాలుంటాయని తన ప్రసంగంలో ప్రకటించారు. త్వరలో జరగబోయే ఎన్ని కల్లో పార్టీ ఓటమి ఖాయమన్న అంచనాలుండటంతో దీన్ని తనకు అనుకూలంగా మలుచుకోవ టానికి ట్రూడో సిద్ధపడ్డారు. అందుకే 'సై అంటే సై' అంటున్నారు. అమెరికాపై ప్రతీకార సుంకాలు విధించ బోతున్నట్టు ప్రకటించారు. ఇప్పటికే 2,100 కోట్ల డాలర్ల విలువైన సరుకుపై సుంకాలు వడ్డించారు. వివాదం సద్దుమణగకపోతే మరో 8,700 కోట్ల డాలర్ల సరుకుపై ఇది తప్పదని హెచ్చరించారు. షీన్‌బామ్ ఈమధ్యే అధికారంలోకొచ్చారు గనుక ఆమెకు కావలసినంత వ్యవధి వుంది. అందుకే ఎంతో సంయమనం పాటిస్తున్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్ని తలకిందులు చేసే ఈ మాదిరి బ్లాక్‌మెయిలింగ్ కొత్తగా ట్రంప్‌కు పుట్టిన బుద్ధికాదు. అమెరికాలో ఎవరున్నా ఇలాంటి బెదిరింపులతోనే ప్రపంచ దేశాలను దారికి తెచ్చుకున్నారు. 1986%–%89 మధ్య సుంకాలు, వాణిజ్యాలపై సాధారణ ఒడంబడిక (గాట్)కు సంబంధించిన ఉరుగ్వే రౌండ్ చర్చల్లోనైనా, ఆ తర్వాత ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)పై జరిగిన దోహా రౌండ్ చర్చల్లోనైనా అమెరికా వ్యూహం ఇదే. బ్రెజిల్ నుంచి వచ్చిన 4 కోట్ల డాలర్ల దిగుమతులపై వంద శాతం సుంకాలు విధించింది. మన నుంచి వెళ్లిన వస్త్ర దిగుమతులపైనా ఇలాంటి చర్యే తీసుకోబోతున్నట్టు హెచ్చరించింది. దాంతో మేధా సంపత్తి హక్కుల(ఐపీఆర్)పై అమెరికా తీసుకొచ్చిన అన్యాయమైన నిబంధనలకు తలొగ్గక తప్పలేదు. ఆఫ్రికా దేశాలనూ ఇలాగే దారికి తెచ్చుకుంది. అమెరికా అతి పెద్ద మార్కెట్ కావటం వల్ల అత్యధిక దేశాలు దానికెళ్లే ఎగుమతులపై ఆధారపడి వుంటాయి. మన దేశం నుంచి అమెరికాకు వెళ్లే ఎగుమతులు 18 శాతమైతే థాయ్‌లాండ్ నుంచి 17 శాతం, దక్షిణ కొరియానుంచి 16 శాతం ఎగుమతులుంటాయి. అమెరికాకు మెక్సికో ఎగుమతులు ఏకంగా 78 శాతం. తమ సంపద పెంచుకోవటానికి సంపన్న రాజ్యాలు నిరంతరం ప్రయత్నిస్తుంటాయి. భారత్‌తో సహా అనేక దేశాలు సుదీర్ఘకాలం పరాయి పాలనలో మగ్గిపోవటానికి ఏకైక కారణం ఇదే. ఉత్పత్తికి అవసరమైన ముడిసరుకు లభ్యతకూ, తయారైన సరుకు అమ్ముకోవటానికీ సరిహద్దులు దాటి వెళ్తూ సమయానుకూలంగా విధానాలు మార్చుకోవడం సంపన్న రాజ్యాల నైజం. గతంలో తన మార్కెట్‌ను విస్తరించుకోవటానికి డబ్ల్యూటీవో తీసుకొచ్చిన అమెరికాయే ఇప్పుడు వేరే మార్గానికి మళ్లింది. అయితే ట్రంప్ చర్యల వల్ల అమెరికాలో ద్రవ్యోల్బణం అధికమవుతుంది. సగటు పౌరుల జీవన వ్యయం పెరిగి పోతుంది. వ్యాపారం దెబ్బతిని నిరుద్యోగం ప్రబలుతుంది. ఆర్థిక వ్యవస్థ మందగిస్తుంది. తరతమ స్థాయిల్లో అన్ని దేశాలూ ఇలాంటి పరిస్థితులు ఎదుర్కొనక తప్పదు. 80 ఏళ్లుగా ప్రపంచ మార్కెట్లను శాసిస్తూ అతిగా సంపద పోగేసిన దేశమే 'నన్ను అందరూ దోచుకుతింటున్నార'ంటూ పెడబొబ్బలు పెట్టడం ఒక వైచిత్రి. కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ నేతృత్వంలోని బృందం అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కోసం ఎదురుచూస్తోంది. ఇప్పుడు ఒక్కొక్క దేశం అమెరికాపై ప్రతీకార సుంకాలకు రెడీ అవుతోంది. ముమ్ముందు కొత్త మార్కెట్ల వెదుకులాట కూడా మొదలవుతుంది. ఇలాకాక దేశాలన్నీ సమష్టిగా వ్యవహరిస్తేనే ఏదో మేర ప్రయోజనం ఉంటుంది. అమెరికాపై ఒత్తిడి పెరిగి సహేతుకమైన పరిష్కారం వీలవుతుంది.

## ఎమ్మెల్సీ సీటు కోసం కాంగ్రెస్‌లో ఆశావహుల ఆశలు

మొదటిపేజీ తరువాయి

ప్రస్తుతం రాష్ట్రంలో ఎమ్మెల్యే కోటాలో 5 ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. మార్చి 29వ తేదీ నాటికి శాసన మండలిలో ఐదు స్థానాలు ఖాళీ కాబోతున్నాయి. ఈ స్థానాలు భర్తీ చేసేందుకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. మార్చి 20వ తేదీన పోలింగ్ జరుగనుంది. దీంతో ప్రధాన పార్టీల్లోని ఆశావహులు ఎమ్మెల్సీ సీటు దక్కించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ సీటు పొందేందుకు రాష్ట్ర స్థాయి నుంచి ఢిల్లీ స్థాయి వరకు లాబీయింగ్‌లు చేస్తున్నారు. ఈ 5 సీట్లలో కాంగ్రెస్‌కు 4 దక్కే అవకాశం ఉంది. 4 ఎమ్మెల్సీలు గెలిచే అవకాశం ఉండటంతో కాంగ్రెస్ పార్టీలో ఆశావహుల తాకిడీ ఎక్కువైంది. టిక్కెట్ కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. ఎమ్మెల్సీ రేసులో జీవన్ రెడ్డి, జగ్గారెడ్డి, వేం నరేందర్ రెడ్డి, సామ రామ్మోహన్ రెడ్డి, జట్టి కుసుమ కుమార్, కుమార్ రావు, హర్కార వేణు గోపాల్ రావు, అంజన్ కుమార్ యాదవ్, చరణ్ కౌశిక్, సునీతా రావు, సరితా యాదవ్ పేర్లు వినిపిస్తున్నాయి. వీరంతా పార్టీ అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. వరి ప్రయత్నాలు ఎలా ఉన్నా.. ఎమ్మెల్యే కోటాలో టీపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డికి ఎమ్మెల్సీ కన్ఫామ్ అయినట్లు సమాచారం అందుతోంది. సామాన్య కార్యకర్త స్థాయి నుంచి టీపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్‌గా, పార్టీ అధికార ప్రతినిధిగా ఎదిగారు సామ. అడ్వకేట్‌గా, మీడియా స్పోక్స్‌పర్సన్‌గా కాంగ్రెస్ పార్టీకి ఎన్నో విధాలుగా సేవలు అందిస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో సామ కృషి కూడా ఉందని ఆ పార్టీ నాయకులే అంటున్నారు. బలమైన బీఆర్ఎస్ పార్టీ నేతలను తన వాగ్ధాటితో ఎదుర్కొని.. ప్రజల్లో నాటి ప్రభుత్వ తీరును, అరాచకాలను, అక్రమాలను ఎండగట్టిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. యువ నాయకుడిగా.. నిత్యం ప్రజలతో మమేకమవుతూ వచ్చిన సామకు ఎమ్మెల్సీ ఇస్తే పార్టీకి మరింత ప్రయోజనం చేకూరుతుందంటున్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సారథ్యంలో పార్టీలో యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ వస్తున్నారు. యువతకు అవకాశాలు ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ మరింత బలపడే అవకాశం అధికంగా ఉంటుంది. అందుకే.. రాష్ట్రంలోనూ యువ నాయకులను పార్టీ ప్రోత్సహిస్తోంది. అందులోనూ సామా రామ్మోహన్ రెడ్డి చాలా నేర్పరి. బీఆర్ఎస్‌లోని అగ్ర నాయకులను సైతం ఎదుర్కొన్న రాజకీయ చతురత కలిగిన నాయకుడు. ఇలాంటి నాయకుడికి ఎమ్మెల్సీ ఇస్తే.. యువతకు మంచి సందేశం పంపినట్లు అవుతుందని పార్టీలోని యువ నాయకులు అభిప్రాయపడుతున్నారు. కేవలం టీపీసీసీ మీడియా కమిటీ ఛైర్మన్‌గానే.. విపక్ష నాయకులను చెడుగుడు ఆడుకుంటున్న సామకు.. ఎమ్మెల్సీ ఇస్తే మరింత బలం చేకూరుతుందని అంచనా వేస్తున్నారు. కష్ట సమయాల్లోనూ కాంగ్రెస్‌కు అండగా ఉంటూ.. కాంగ్రెస్ అధికారి ప్రతినిధిగా సేవలందించిన సామకే ఎమ్మెల్సీ ఇవ్వాలని పార్టీలోని యువ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. సామకు ఎమ్మెల్సీ ఇస్తే.. పార్టీలో యువతను మరింత ప్రోత్సహించినట్లు అవుతుందని తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకులపై కేసీఆర్ సమీక్ష

మొదటిపేజీ తరువాయి

ఏప్రిల్ 27న జరగబోయే బహిరంగ సభపై పార్టీ నేతలతో కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆవిర్భావ రజతోత్సవ వేడుకలపై పార్టీ నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసంలో జరిగిన ఈ సన్నాహక సమావేశానికి కేటీఆర్, హరీశ్‌రావు, మధుసూదనాచారి, శ్రీనివాస్ గౌడ్, నిరంజన్ రెడ్డి, కేఆర్ సురేశ్, బండా ప్రకాశ్, సబితా ఇంద్రారెడ్డి, కవిత, గంగుల కమలాకర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, వినోద్ కుమార్, ఎర్రబెల్లి దయాకర్ రావు, లక్ష్మారెడ్డి, పద్మారావు గౌడ్, జగదీశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, దేశపతి శ్రీనివాస్, శేరి సుభాష్ రెడ్డితో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

### శీష్ మహల్‌లో కూర్చొని పనిచేసే సీఎంను కాను: రేఖా గుప్తా

దేశ రాజధానిలో ఓ మీడియా సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంపై మండిపడ్డారు. ఆమ్‌ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్నంత కాలం దేశరాజధాని అభివృద్ధికి నోచుకోలేదన్నారు. పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ప్రజల గురించి ఆలోచించకుండా శీష్ మహల్ నిర్మించుకోవడంలో బిజీగా ఉన్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనలా తాను మహల్‌లో కూర్చొని పని చేసే సీఎంను కానన్నారు. 24గంటలు ప్రజల మధ్యే ఉంటూ వారి కోసం పని చేసే ముఖ్యమంత్రినని చెప్పారు.

ఢిల్లీలో మహిళను సీఎంను చేయడంతో సులభంగా అధికారం తమ చేతిలో పెట్టుకోవచ్చని భాజపా నేతలు ఈ పదవిని కట్టబెట్టినట్లు వస్తున్న వార్తలపై ఆమె బదులిచ్చారు. మహిళలపై భాజపాకు ఉన్న గౌరవంతోనే దేశరాజధానికి తనను సీఎంగా నియమించారని అన్నారు. ముఖ్యమంత్రి పదవిలో ఉన్న తనను కేవలం ప్రజలు మాత్రమే నియంత్రించగలరని తెలిపారు. పార్టీ నేతలు కేవలం తనకు కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తారే తప్ప అధికారం తమ గుప్పిట్లో పెట్టుకోవాలనే ఆలోచన వారికి ఉండదని చెప్పారు. తామంతా ప్రధాని మోదీ ఆధ్వర్యంలో కలిసికట్టుగా దేశరాజధానిని అభివృద్ధి బాటలో నడుపుతామని విశ్వాసం వ్యక్తం చేశారు. "అధికారం చేపట్టిన మొదటి రోజే శీష్ మహల్‌లో ఉండబోనని చెప్పాను. ప్రజలు కష్టపడి సంపాదించుకున్న డబ్బును విశ్రాంతి, సౌకర్యం కోసం ఉపయోగించుకునే హక్కు నాకు లేదు. ఆ ఆస్తి ఢిల్లీ ప్రజలది" అని రేఖా గుప్తా అన్నారు. ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సీఎంగా పనిచేసిన సమయంలో అధికారిక నివాసంగా ఉపయోగించిన బంగ్లాను 'శీష్ మహల్ (అద్దాల మేడ)'గా భాజపా అభివర్ణించింది. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి ఆయన 7 స్టార్ రిసార్ట్‌గా మార్చుకున్నారని విమర్శించింది. కేజ్రీవాల్ మోసాలకు ఆ మహల్ ఓ ఉదాహరణ అంటూ భాజపా ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లింది. ఆప్ ప్రభుత్వంపై వచ్చిన ఈ అవినీతి ఆరోపణలు అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని దెబ్బతీశాయి.

## కళ్లెదుట జలదోపిడీ జరుగుతున్నా స్పందించరా..?

మొదటిపేజీ తరువాయి

కృష్ణా జలాలను ఏపీ ప్రభుత్వం తీసుకెళ్తున్నా సీఎం రేవంత్‌రెడ్డి కళ్లుండి చూడలేకపోతున్నారని, ఇలాంటి మొద్దునిద్ర సీఎంను నేనెప్పుడూ చూడలేదని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. బనకచర్ల ద్వారా 200 టీఎంసీల కృష్ణా నీళ్ల తరలింపు కోసం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్ర చేస్తుంటే రేవంత్ రెడ్డి ఎందుకు మౌనం వహిస్తున్నారని హరీశ్‌రావు ప్రశ్నించారు. బనకచర్ల ద్వారా గోదావరి వరద జలాలనే తీసుకువెళ్తున్నాం, తెలంగాణకు నష్టం లేదు అని ఏపీ నీళ్ల మంత్రి అంటే నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ మౌనం వహించడం వెనుక అంతర్యమేంటని ప్రశ్నించారు. మూడు నెలలుగా నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి రోజుకు 10వేల క్యూసెక్కులను ఏపీ తరలించుకుంటుంటే రాష్ట్ర ప్రభుత్వం మౌనంగా ఉందన్నారు. గోదావరి, కృష్ణా నీటిలో తెలంగాణ వాటాను ఏపీ ఇష్టారాజ్యంగా తరలించే కుట్రలు చేస్తుంటే ఈ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి, ఉత్తం కుమార్ రెడ్డి సహా ఒక్క నాయకుడికి పట్టింపు లేదు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. "బనకచర్ల తో తెలంగాణకు ఏమి నష్టం" అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంగా మాట్లాడి మూడు రోజులైనా ఒక్కరూ గట్టిగా స్పందించలేదు. తెలంగాణ నీటి ప్రయోజనాలు ఈ సర్కారుకు పట్టవా అక్రమంగా నీటిని తరలించుకు పోతుంటే మొద్దు నిద్రలో ఉంటారా..? చంద్రబాబును అడ్డుకునే ధైర్యం, కేంద్రాన్ని అడిగే దమ్ము కాంగ్రెస్, బీజేపీ ఎంపీలకు లేదా? చంద్రబాబుతో బీజేపీ, రేవంత్ దోస్తీ చేస్తూ తెలంగాణను మోసం చేస్తారా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. బాబు, రేవంత్, బీజేపీ మధ్య లోపాయికార ఒప్పందం ఏమిటి? బిఆర్ఎస్ పార్టీ గొంతెత్తినా మీకు చలనం కలగదా? కాంగ్రెస్, బిజెపి తీరు తెలంగాణ తాగు, సాగు నీటి రంగానికి గొడ్డలి పెట్టుగా మారుతున్నది. తెలంగాణ ప్రయోజనాల కోసం బిఆర్ఎస్ పార్టీ పడుతున్న ఆరాటం మీకు ఎలాగూ అర్థం కాదు, కనీసం మీడియాలో వస్తున్న కథనాలను చూసైనా కదలండి. ఇప్పటికైనా ఏపీ ప్రభుత్వ జల దోపిడీని అడ్డుకోండి. కేంద్రాన్ని నిలదీయండి. రేవంత్ సహా బిజెపి ఎంపీలు, కేంద్ర మంత్రులు మౌనం వీడండి! అని హరీశ్‌రావు సూచించారు.

## పెంచాల్సిన వేతనాలు తగ్గించడమా.. ఇదేం పాలన?:

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిని ఇదేం పాలన అని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పెంచాల్సిన వేతనాలను తగ్గించడమేంటని అడిగారు. "ఉద్యోగులకు డీఏలు ఇవ్వరు.. ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు పెంచరా? డ్రైవర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లకు 25 శాతానికి పైగా వేతనాలు తగ్గించడం దుర్మార్గం? ఇది కాంగ్రెస్ ప్రభుత్వ మతిలేని చర్య. నాలుగేళ్లుగా ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు ఎందుకు పెంచడం లేదు? ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుణపాఠం చెప్పినా తీరు మారదా? తక్షణమే ఔట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలను పెంచండి" అని బండి సంజయ్ అన్నారు.

## బీసీలపై చిత్తశుద్ధి ఉంటే బీఆర్ఎస్ పార్టీ ప్రెసిడెంట్ పదవి బీసీలకు ఇవ్వాలి

మొదటిపేజీ తరువాయి

శాసన మండలిలో కూడా మరో బీసీ నేతకు ఇవ్వాలని ఛాలెంజ్ చేశారు. ఇచ్చిన నాలుగు మంత్రి పదవులు బీసీలకు ఎందుకు ఇవ్వరని రఘునందన్ రావు ప్రశ్నించారు. ఈటెల రాజేందర్ బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు బీసీల్లో పెద్ద సామాజిక వర్గానికి చెందిన ఈటెలను మధ్యలోనే మంత్రి పదవి నుంచి ఎందుకు తీసేశారని ఎంపీ రఘునందన్ రావు నిలదీశారు. కేసీఆర్ కుటుంబానికి పదవులు కావాలి.. మరి బీసీలకు పదవులు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ రోజు ఫామ్‌హౌస్ చర్చలో కేసీఆర్‌తో తాను చెప్పిన విషయంపై కవిత మాట్లాడాలని సవాల్ విసిరారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అవకాశం వస్తే బీజేపీలో ఒక మహిళకు ఇచ్చామని గుర్తుచేశారు. మొదటి ఐదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క మహిళకు కూడా మంత్రి పదవి ఇవ్వలేని ఒకే ఒక కేబినెట్ ఈ దేశంలో ఏదైనా ఉంటే అది కేసీఆర్ కేబినెట్ అని విమర్శించారు. బీజేపీని విమర్శించే ముందుగా బీఆర్ఎస్ చేసిన తప్పులు సరిదిద్దుకోవాలని చెప్పారు. బీజేపీ వైపు వేలెత్తి చూపించే బదులు ముందుగా బీఆర్ఎస్ నేతలు తప్పులు సరిదిద్దుకోవాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు హితవు పలికారు.

## అర్హులకు రేషన్‌కార్డులు ఇస్తాం : మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగోలేని కారణంగా తులం బంగారం కొంత ఆలస్యమవుతుందని చెప్పారు. గత కేసీఆర్ ప్రభుత్వం అభివృద్ధి పేరుతో అరాచకం సృష్టించిందని విమర్శించారు. వాటన్నింటినీ గాడిన పెడుతూ తమ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలను చేపడుతున్నామని అన్నారు. ఎక్కడ తగ్గకుండా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని తెలిపారు. ఇచ్చిన ప్రతి హామీని ఆలస్యమైనా నిలబెట్టుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## మహిళల ఆర్థికాభివృద్ధి ప్రత్యేక చర్యలు


మొదటిపేజీ తరువాయి

భూగర్భం నుంచి అంతరిక్ష రంగం వరకు అన్ని రంగాల్లో మహిళలకు అవకాశాలు రావాలి. మహిళల కష్టానికి తగిన ఫలితం దక్కినప్పుడే నిజమైన మహిళా దినోత్సవం. మహిళలు ఎంత ఎత్తుకు ఎదిగిన వివక్షత కొనసాగుతూనే ఉంది. మహిళలు ఎమ్మెల్యేలు మంత్రులు ఐఏఎస్‌లు అయినా లైంగిక అసమానతలను ఎదుర్కొంటూనే ఉన్నారు. ఒకప్పుడు మహిళలకు వ్యవసాయం, పరిశ్రమలు మాత్రమే ఉపాధి మార్గాలు. కానీ ఇప్పుడు ఎన్నో రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు. అయినప్పటికీ మహిళల పట్ల సమాజంలో చిన్న చూపు పోవడం లేదు. ప్రతి రంగంలో మహిళల ప్రస్థానాన్ని, వారి స్థానాన్ని సమీక్షించాలి. లింగ సమానత్వం విషయంలో ఐక్యరాజ్యసమితి నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎంత మేర మనం చేరుకోగలుగుతున్నామో ఆవలోకనం చేసుకోవాలి. మహిళలకు సమానత్వం, సమాన అవకాశాలు రావాలి. లింగ అంతరాలను తుంచితినే సమాజంలో సమానత్వం. శారీరకంగా మహిళలకు ఎన్నో ప్రతికూలతలు ఉన్నాయి. వాటన్నిటినీ అధిగమించి మహిళలు ముందంజ వేస్తున్నారు. మహిళల ప్రతికూలతలను దృష్టిలో ఉంచుకొని విధానాల రూపకల్పన జరగాలి' అని మంత్రి సీతక్క తెలిపారు. 'ఆదిశలో ప్రజా ప్రభుత్వం ప్రయత్నాలు మొదలు పెట్టింది. మహిళా అనుకూలంగా అత్యుత్తమ విధానాన్ని రూపొందించేందుకు కమిటీని ఏర్పాటు చేస్తున్నాం. అనుభవజ్ఞులంతా సలహాలు సూచనలు చేస్తే, అనుగుణంగా నూతన విధానాన్ని రూపొందిస్తాం. లింగ సమానత్వాన్ని సాధించడంలో మహిళా సంఘాల పాత్ర గణనీయంగా ఉంది. మహిళా సంఘాలు మహిళలకు ఆర్థిక రక్షణతో పాటు సామాజిక భద్రత కల్పిస్తున్నాయి. ఈ ఏడాది అనుకున్న లక్ష్యాలకు మించి మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించాం. రూ. 20వేల కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యం నిర్దేశించుకుంటే.. రూ. 22 వేల కోట్ల వరకు రుణ సౌకర్యం కల్పించాం. మహిళా తన కాళ్ల మీద తాను నిలబడాలి, రాజకీయ రంగంతోపాటు అన్ని రంగాల్లో బలమైన శక్తిగా ఎదగాలి. రాజ్యాలు సొంతగా పాలన చేసేలా మహిళలు ఎదగాలి. మహిళలే అసలు సిసలు ఆర్థిక శాస్త్రవేత్తలు. పుస్తకాల ఆర్థిక శాస్త్రవేత్తలు ఎందరో ఉంటారు.. కానీ ఆచరణలో, కుటుంబ నిర్వహణలో మహిళలే అత్యున్నత ఆర్థికవేత్తలు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో అతివలు అపూర్వ విజయాలు సాధిస్తున్నారు. మహిళా అభివృద్ధితోనే సమాజం ప్రగతి సాధిస్తుంది. వచ్చే మహిళా దినోత్సవం లోపు సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో రెండు మెట్లు ఎదిగేలా కృషిచేస్తాం" అని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు..

### కేంద్రంపై ఒత్తిడికి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

మొదటిపేజీ తరువాయి



పెండింగ్ ప్రాజెక్టులకు నిధుల సాధనకు పార్లమెంట్‌లో ఎంపీలు ప్రస్తావించే విధంగా ప్రభుత్వం వ్యూహరచన చేస్తోంది. ఇందులో భాగంగా ప్రజాభవన్‌లో ఈ నెల 8న (శనివారం) అన్ని పార్టీల ఎంపీల సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన ఈ భేటీ జరగనుంది. కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు. ఎంపీల సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. ఈమేరకు కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో రాష్ట్రంలోని అందరు ఎంపీలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫోన్ చేసి భేటీకి ఆహ్వానించారు.

# కోరుట్లలో మురికి పాలన

# కబ్జాదారుల కాంబినేషన్

**ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి**

**కోరుట్ల లో ఒక పాత్రికేయుడు,ఒక న్యాయవాది,ఒక కౌన్సిలర్ కలిస్తే కబ్జాల, పైరవీల కాంబినేషన్ అవుతుందని అవినీతి శాస్త్రం చెబుతున్నది.ఈ కాంబినేషన్ కు సంబంధిత అధికారులు జత కలిస్తే అవినీతి పరిమళాలు మురికి కాలవలో కలిసి ఉద్ధృతంగా ప్రవహిస్తూ వాసనలు వెదజల్లుతాయి.**

- **కోరుట్ల మున్సిపల్ లో అధికారుల ఇష్టారాజ్యం**
- **దొరికినంత దోచుకునుడే**
- **ప్రతి ఉద్యోగి ఏసీబీ కి పట్టుబడేంత ఘనుడే**
- **ఇప్పటికే ఒకరు లాంగ్ లీవులో, ఒకరు సస్పెన్షన్ లో, మరొకరు ఏసీబీ వలలో చిక్కేంత చేరువలో**



కోరుట్ల పురపాలనంతా అవినీతి కూపంలో చిక్కుకుని కంపు వాసనతో జనాలు అసహ్యించుకునే పరిస్థితిని కల్పించి పెట్టారు.కోరుట్ల మున్సిపల్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ చేస్తున్న అవినీతికి అంతులేకుండా పోయింది.అధికారుల సంపాదన మాత్రం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నది.డైరెక్ట్ గా ముడుపులు తీసుకుంటే ఎక్కడ అవినీతి నిరోధక శాఖ వలలో చిక్కుతామోనని, చదివింపుల సంస్కృతిని ఆచరిస్తున్నారు.తీసుకునే లంచం వస్తు రూపంలో లేదా బంగారం రూపంలో తీసుకోవడం పరిపాటి అయింది.సామాన్య ప్రజలు ఏదైనా సమస్య ఉండి ఫోన్ చేస్తే కనీసం ఎత్తడం కూడా అలవాటు లేని అధికారులు అవినీతి మత్తులో కాంట్రాక్టర్లకు రాజకీయ నాయకులకు, బుడ్డ బాబులకు,రెడ్ కార్పెట్ వేస్తూ పబ్బం గడుపుకుంటున్నారు.వీరికి భయం లేకుండా విచ్చలవిడిగా లంచాలు తీసుకోవడం వెనుక కొందరు రాజకీయ నాయకులతో పాటు, కొందరు సీనియర్ పాత్రికేయులు కూడా ఉన్నారన్న విషయం బహిరంగ రహస్యం.సర్వాంతర్యామిగా మారిన అవినీతి మున్సిపల్ మురికిని శుభ్రం చెయ్యడం కష్టమైన పని అని జనం భావించుకుంటున్నారు.అవినీతిని కడగడం సర్ఫ్ ఎక్సెల్ తో సాధ్యం కాదు. ఆసిడ్ తో క్లీన్ చేయాల్సిన అవసరం ఎంతో ఉందంటున్నారు అమాయక జనం.లేకపోతే తామే దగ్గరుండి ఏసీబీ కి చిక్కేలా ప్లాన్ చెయ్యడం తప్ప మార్గం లేదని లంచాల భాధిత ప్రజలు కసితో రగిలిపోతున్నారు.అధికారులు లంచం తీసుకుంటే ఎసిబి కి పట్టించవచ్చు. మరి మున్సిపల్ కౌన్సిలర్ల అవినీతికి అడ్డుకట్ట ఎలా వేయాలో అని జనం కొత్త మార్గాల అన్వేషణ చేస్తున్నారు.ఒక పాత్రికేయుడు, ఒక కౌన్సిలర్,ఒక న్యాయవాది,ఒక ప్రభుత్వ అధికారి కలిసి అవినీతి కాంబినేషన్ గా అవతారమెత్తి స్వయం ఉపాధి పొందుతున్నారని అందరికీ తెలిసిన విషయమే.రెవిన్యూ రికార్డుల్లోని లొసుగులు వెతికి ఈ ముఠా ల సహకారం తో పోలీసులను కూడా మేనేజ్ చేసి అమాయకులను నిస్సహాయులను తీవ్ర నష్టానికి గురి చేస్తున్నారు.గతంలో కోరుట్లలో తహసీల్దార్ గా పనిచేసిన ఒక రెవెన్యూ అధికారి ఇలా రికార్డుల టాంపరింగ్ లో ఆదాయాన్ని వెతుక్కున్నాడన్న విషయం అందరికీ తెలిసిందే.న్యాయంగా ఇల్లు కట్టుకున్నా సరే, మున్సిపల్ సిబ్బందిని పంపి తట్టా, పలుగు,పార గుంజుకుని నిర్మాణ పనులు ఆపించే ప్రజా క్షురక కౌన్సిలర్ల సంగతి అందరికీ తెలిసిందే.ఇది సివిల్ మ్యాటర్ కాబట్టి పోలీసులకు ఫిర్యాదు చెయ్యలేక ఒక సాధారణ పౌరుడు విల విల లాడడం తప్ప ఏమీ చెయ్యలేని పరిస్థితి.కష్టపడి సంపాదించుకుని ఒక ఇల్లు కట్టుకుందామని, మున్సిపల్ పర్మిషన్ తీసుకున్నాసరే ముడుపులు కౌన్సిలర్లకు,అధికారులకు ముట్టాల్సిందే.ఎవరికి ఫిర్యాదు చేసినా ఏమీ ఉపయోగం ఉండదని కోరినంత డబ్బు అవినీతి హుండీలో వేసి దండం పెట్టి నిర్మాణ పనులు చేసుకుంటున్నారు నిస్సహాయ మున్సి బాధితులు.కొందరు పోలీసులు ఈ సహకార ముఠాల ప్రభావానికి లోనై తమ పరిధిలో లేని సివిల్ వివాదాల్లో తలదూర్చి ఈ స్వయం ఉపాధి ముఠాల ప్రయోజనాలు నెరవేర్చి లాభాల పంపకంలో వాటాలు పంచుకుంటున్నారని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.ఎవరేమనుకున్నా డబ్బు సంపాదనే లక్ష్యంగా అందరూ పని చేసుకుంటున్నారు. కోరుట్ల మున్సిపాలిటీ అధికారులు, కౌన్సిలర్ల అవినీతికి అడ్డుకట్ట వేసే అవకాశం కొరకు జనం ఎదురు చూస్తున్నారు.రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో తాజా మాజీల ముఖాలు మళ్ళీ గెలవకుండా, కౌన్సిల్ లో కనిపించకుండా చూడాలని కోరుట్ల జనం ఇప్పుడు అనుకుంటున్న సంగతి.ప్రజల తక్షణ ప్రభుత్వ శాఖలు మూడు.మున్సిపల్,రెవెన్యూ,పోలీస్ డిపార్ట్ మెంట్ లు.భూముల విషయంలో పోలీసులు జోక్యం చేసుకోక పోతే చాలు, ఈ సహకార సంఘ సభ్యుల సంగతి మేము చూసుకుంటామని బాధిత జనం కసితో ఉన్నారు.ఈ భూముల విషయంలోనే గతంలో ఒక న్యాయవాది పై దాడి జరిగింది. ఒక స్థానిక రాజకీయుడిపై దాడి జరిగింది.ఈ భూవివాదాలే హత్యలకు దారితీస్తున్నాయి.కానీ, చట్టం మంత్రం వేసి బతుకుతున్న ముఠాల అవతారం ఇప్పుడు కోరుట్లను పట్టి పీడిస్తున్నది.

ఈ పైరవీ కాంబినేషన్ ముఠాలకు లోటు పాట్లు వివరించి పురిగొలిపే ఒక సూత్రధారి శ్రీకృష్ణుడు కోరుట్లలో చక్రం తిప్పుతున్నాడని కొందరికి తెలిసిపోయింది.ఇప్పుడు ఈ విషయం అందరికీ అర్థం అయింది.ఇంకో ఇరవై సంవత్సరాల వరకు మాదే రాజ్యం అని ఈ కాంబో నాయకుడు, ఒక పాత్రికేయుడు ప్రగల్భాలు పలికిన విషయం జనంలో చక్కర్లు కొడుతున్నది.పాత్రికేయత పవిత్ర భాధ్యత.పాత్రికేయులకు తగిన ఆదాయం ఉండదు. ఆదాయం సరిపోక గతంలో కొందరు పాత్రికేయులు ఎన్నో భాధలు అనుభవించారు.ఇది గతం.ఈ తరంలో కొందరు పాత్రికేయ బాధ్యతను వృత్తిగా మలచుకుని, వ్యాపారంగా మార్చుకుని కోరుట్లలో హైద్రాబాద్ లాంటి నగరాల్లో ఆస్థులు కూడబెట్టుకున్న విషయం వీనుల విందుగా వినిపిస్తున్నది.ఇలా ఈ కాంబో ముఠాలు పొద్దున లేస్తే పోలీస్ స్టేషన్లో,మున్సిపల్ ఆఫీసులో, రెవెన్యూ ఆఫీసులో పనులు చక్కబెట్టుకుంటూ దర్శనమిస్తారు.ఇంకా చెప్పాలంటే పంచాయతీ రూపంలో ప్రైవేటు కోర్టులు నిర్వహిస్తున్నారు.ఇంతే కాదు సమస్య ఏదైనా మా కనుచూపు దాటిపోకూడదనే నేర్పు ప్రదర్శిస్తున్నారు.ప్రతి భూమి సమస్యకు లీగల్ టచ్ ఇచ్చి, పోలీసులను ఉసిగొల్పి అమాయకుల భూములను స్వాహా చేసే దమ్ము మాకున్నదని ఈ కాంబో వీరులు రెచ్చిపోతున్నారు.ఈ కబ్జా దారుల,పైరవీ కారుల కాంబినేషన్ తప్పకుండా అంతరించాలని జనంలో కసి రాగులుతున్నది. ఈ లోజ్వరం కు మందులు నూరే ప్రక్రియ రూపు దిద్దుకుంటున్నది.వంద గొడ్లు తిన్న గద్ద కూడా ఒక గాలి వానకు కూలడం తప్పదన్న సామెత నిజం అయి తీరుతుంది.

# చట్ట సభల్లో మహిళల రిజర్వేషన్ అవసరం

**కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి**

దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో మహిళల పాత్ర అనివార్యం. పురుషులతో పాటు మహిళల సమాన భాగస్వామ్యం ఉంటేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది. అయితే, ప్రపంచ ఆర్థిక ఫోరం 2022 నివేదిక ప్రకారం, లింగ సమానత్వ పరంగా భారతదేశం 135వ స్థానంలో ఉంది. మన దేశ చట్ట సభల్లో మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. ప్రస్తుతం పార్లమెంట్‌లో మహిళలు కేవలం 15% మాత్రమే ఉన్నారు, ఇది సమతుల్యత కలిగిన సమాజ నిర్మాణానికి అడ్డుగోడగా నిలుస్తోంది.మహిళా



రిజర్వేషన్ కోసం 1996లోనే బిల్లు ప్రవేశపెట్టినప్పటికీ, ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. రాజకీయ పార్టీలు మహిళా సాధికారతపై పెద్ద పెద్ద మాటలు చెబుతున్నా, వారికి తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదు. కొన్ని రాష్ట్రాల్లో 50% స్థానాలు మహిళలకు రిజర్వ్ చేసినా, దేశవ్యాప్తంగా ఇది ఇంకా అమలు కాలేదు.మహిళలకు 33% రిజర్వేషన్ కల్పిస్తే, వారి ప్రాతినిధ్యం పెరిగి దేశ పాలనా వ్యవస్థ మరింత శక్తివంతం అవుతుంది. మహిళా నేతల అధిక సంఖ్య సమాజంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రగతికి దోహదపడుతుంది. ఇది కేవలం మహిళల హక్కుల పరిరక్షణ మాత్రమే కాక, సమతుల్యమైన పాలనకు కూడా దారి తీస్తుంది.కాబట్టి, ప్రభుత్వం, ఎన్నికల సంఘం, రాజకీయ పార్టీలు మహిళలకు అవకాశాలు కల్పించే దిశగా ముందడుగు వేయాలి. మహిళా సాధికారతను ప్రోత్సహించడం ద్వారా మాత్రమే సమాజ పురోగతి సాధ్యమవుతుంది.మహిళా సాధికారతే సమాజ పురోగతికి పునాది!

# ఇన్స్పైర్ అవార్డ్ సాధించిన గాయత్రి విద్యానికేతన్ విద్యార్థిని

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**

డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ - ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇన్స్పైర్ - మనక్ పోటీలలో భాగంగా రోడ్డు ప్రమాదాల ముందస్తు నివారణ అనే అంశంపై చేసిన ప్రయోగానికి గాను పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ కి చెందిన 9 వ తరగతి విద్యార్థిని అమీమా తహ్రీం ఎంపికైనట్లు గాయత్రి విద్యా సంస్థల ఛైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా సైన్స్ అధికారి రఘునందన్ రావు గారు ఇన్స్పైర్ అవార్డ్ కి ఎంపికైన విద్యార్థిని కి సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్టిఫికెట్ తో పాటు ?10, 000 నగదు బహుమతి సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో మరిన్ని ఆవిష్కరణలు చేయడానికి ప్రోత్సాహాన్ని అందిస్తున్న గాయత్రి విద్యా సంస్థల యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం విద్యార్థిని అమీమా తహరీమ్ ను అభినందించి రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, గైడ్ టీచర్స్ సదానందం, శరణ్య, రజియుద్దీన్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# జలమండలిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



**మహేందర్ కూరపాటి, కరపత్రం ప్రతినిధి**


జలమండలిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఉస్మానియా ఆసుపత్రి వైద్యురాలు ఎం.అనిత (రిటైర్డ్ గైనకాలజిస్ట్) గౌరవ అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈఎన్సీ, డైరెక్టర్ ఆపరేషన్స్-2 వీఎల్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. బోర్డు మహిళా ఉద్యోగులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అటు ఇంట్లో, ఇటు బయట రెండు చోట్లా పనిచేయడం మహిళలకే చెల్లిందన్నారు. ఇంకా జలమండలి లాంటి అత్యవసర శాఖలో పనిచేయడం ఇబ్బందికరమని, అయినా కూడా సమర్థంగా విధులు నిర్వర్తిస్తున్నారని కొనియాడారు. బోర్డులో కొత్తగా రిక్రూట్ అయిన మహిళా ఉద్యగులకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళా దినోత్సవం అంత ఆషామాషీగా రాలేదని.. ఎంతో మంది సామాజిక సంస్కర్తల వల్ల వచ్చిందని తెలిపారు. వారి హక్కులను సమర్థంగా వినియోగించుకుని ఎదగాలని ఆకాంక్షించారు.గౌరవ అతిథిగా హాజరైన డాక్టర్ అనిత మాట్లాడుతూ.. ఉద్యోగం చేసే మహిళలు జాబ్ తో పాటు కుటుంబానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అటు ఉద్యోగ జీవితాన్ని, ఇటు వ్యక్తిగత జీవితాన్ని రెండింటినీ బ్యాలెన్స్ చేసుకోవాలని సూచించారు. ఈ హడావుడిలో ఆరోగ్యంపైనా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.మరో గౌరవ అతిథిగా వచ్చిన వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంబాబు యాదవ్ మాట్లాడుతూ.. మహిళల హక్కులకు వ్యతిరేకంగా జరిగే వాటిపైన పోరాటం చేయాలన్నారు.జలమండలి ఉమెన్స్ మినిస్టీరియల్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో.. సీజీఎంలు అబ్దుల్ ఖాదర్, నారాయణ, చంద్రజ్యోతి, జీఎంలు సుగంధిని, సరస్వతి, అసోసియేషన్ అధ్యక్షురాలు శైలజ, జనరల్ సెక్రటరీ బిల్కిస్ బాను, ప్రతినిధులు, సభ్యులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికులు ఎదుగుండ్ల సమస్యలపై ధర్నా ఎంపీడీవో కు వినతిపత్రం

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట మార్చి 7**

జమ్మికుంట మండల్ లో గ్రామపంచాయతీ కార్మికుల ధర్నా ఈ ధర్నా కార్యక్రమంలో జమ్మికుంట మండల గ్రామ పంచాయతీ కార్మికులు మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ధర్నా చేయడం జరిగింది గ్రామపంచాయతీ కార్మికులు తమ ఎదుర్కొంటున్న సమస్యల పట్ల గత నాలుగు నెలల నుండి పెండింగ్ వేతనాలు ఉన్నాయని కుటుంబాన్ని పోషించలేక అప్పుల బాధలు ఉన్నామని గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చని మొండి వైఖరిగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తుందని మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని 60జీవో ప్రకారం 16 వేల వేతనం ఇవ్వాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క గ్రామపంచాయతీ కార్మికులకు గ్రీన్ ఛానల్ ద్వారా జనవరి నెల నుండి నేరుగా కార్మికుడి అకౌంట్లో డబ్బులు వేస్తామని డిసెంబర్ నెలలో హామీ హామీ ఇవ్వడం జరిగింది ఇప్పటికీ మూడు నెలలు గడుస్తున్న కార్మికులకు వేతనాలు అందడం లేదు ఒక్కొక్క గ్రామపంచాయతీలో రెండు మూడు నెలల నుండి వేతనాలు అందడం లేదు కార్మికులకి కనీస భద్రత పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం లేదు ప్రతి కార్మికుడికి 15 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కార్మికుడికి కనీస వేతనం24000 ఇవ్వాలని కార్మికుడు రిటైర్మెంట్ తరువాత ఐదు లక్షల నెక్స్ట్ గ్రేషియా ఇవ్వాలని కార్మికుల్లో కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని



తదితర డిమాండ్లతో రాష్ట్ర ప్రభుత్వానికి కార్మికులు పలుసార్లు వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది అయినా ప్రభుత్వం ఇప్పటికీ కార్మికుల పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూస్తుంది రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలలో గ్రామపంచాయతీ కార్మికులకు ప్రత్యేక బడ్జెట్ను కేటాయించి వేతనాల కోసమై చర్య తీసుకోవాలని ప్రభుత్వానికి కార్మికులు డిమాండ్ చేశారు లేనట్లయితే కార్మికులు మరో పోరాటడానికి సిద్ధమవుతారని తెలియజేశారు అధ్యక్షుడు ఎండిగా రవీంద్రరావు ప్రధాన కార్యదర్శి లద్దు నూరి కుమార్ జనరల్ సెక్రెటరీ మేక మల్ల రాము



సంపత్ వాసాల సారయ్య సంజీవ్ రవి రాజ కొమురయ్య రాజు తిరుపతి మైపాల్ రెడ్డి ఉమా వనిత అలీమా స్వప్న రాజమణి.

# ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**కరపత్రం రామగిరి ప్రతినిధి, మార్చ్ 07.**
రామగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఎంపీడీవో శైలజ రాణి నీ, మహిళ అధికారులను శాలువాతో సత్కరించి మెమొంటోను కార్యాలయ సిబ్బంది అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని, తమ కాళ్లపై తాము నిలబడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శైలజా రాణి, ఎంపీవో ఉమేష్ , ఐ సి ఎ పి ఓ మౌనిక, టి ఎ లు అఖిల, సుప్రియ, పంచాయతీ కార్యదర్శులు, ఈ ఫ్యాన్ ఆపరేటర్స్, ఈజీఎస్ స్టాఫ్ పాల్గొన్నారు.

# సెమీఫైనల్ కు అర్హత సాధించిన వాగ్దేవి (జేఎన్టీయూ) ఇంజనీరింగ్ కళాశాల

**కరపత్రం రామగిరి ప్రతినిధి, మార్చ్ 07.**
మంథని జెఎన్టియు ఇంజనీరింగ్ కళాశాలలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య క్రీడామైదానంలో జరుగుతున్న బి జోన్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్లో వరంగల్ కు చెందిన వాగ్దేవి (జేఎన్టీయూ) ఇంజనీరింగ్ కళాశాల గ్రూపు బి విజేతగా నిలిచి సెమీఫైనల్ కు అర్హత సాధించింది.ఆడిన రెండు మ్యాచ్లోను గెలిచి సెమీఫైనల్ కు చేరుకుంది.ఉదయం జరిగిన మ్యాచ్లో వరంగల్ కు చెందిన వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల,కరీంనగర్ కు చెందిన వాగేశ్వరీపై సునాయసంగా గెలిచింది. వాగ్దేవి 128 పరుగులు చేసింది.కోట్టే రాకేశ్ 34, బండారు అభినయ్ 30 పరుగులు చేయగా వినయ్ రెండు వికెట్లు తీశారు.వాగేశ్వరీ కేవలం 51 పరుగులు చేసి ఓటమి పాలయింది.కళ్యాణ్ 4, అభినయ్ 3 వికెట్లు తీశారు.వాగ్దేవికి చెందిన అభినయ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా ఎంపికయ్యాడు.రెండవ మ్యాచ్లో వాగేశ్వరీని



హుజురాబాద్ కిట్స్ ఓడించింది.మొదట బ్యాటింగ్ చేసిన కిట్స్ 7 వికెట్లకు 163 పరుగులు చేసింది.కె రాంచరణ్ 40,సాయి 38 పరుగులు చేయగా ఫర్యాన్ 2 వికెట్లు తీశారు.అనంతరం వాగేశ్వరి 131 పరుగులే చేసింది.సాయి 3,వంశీ 2 వికెట్లు తీశారు.సాయి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా ఎంపికయ్యారు.మధ్యాహ్నం జరిగిన మరో మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన కిట్స్ కేవలం 66 పరుగులే చేసింది.సాయి 25 పరుగులు చేయగా అజయ్ రెడ్డి 4, అభినయ్ 3,కళ్యాణ్ 3 వికెట్లు తీశారు.అనంతరం వాగ్దేవి 3 వికెట్లు కొల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.రాకేశ్ 30 పరుగులు చేయగా వంశీ రెండు వికెట్లు తీశాడు.మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా అజయ్ రెడ్డి ఎంపికయ్యాడు. బహుమతి ప్రదానానికి రామగిరి ఎస్ఐ చంద్రకుమార్ హాజరై బహుమతులు అందించారు.ప్రతి విద్యార్థి నిత్యం ఏదో ఒక ఆటను ఆడాలన్నారు.దీంతో శారీరకంగానే కాకుండా మానసికంగా ధృడంగా ఉంటారన్నారు.క్రమశిక్షణ అలవరుస్తుందన్నారు. ముఖ్యంగా పోటీతత్వం ఏర్పడి భవిష్యత్తులో రాణించడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ పింగిళి కృష్ణారెడ్డి, క్రీడాకారులు పాల్గోన్నారు.

# జీవిత బీమా పై ప్రజలకు వివరించాలి:



- ఈడి శ్రీనివాసరెడ్డి

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిది**
జీవిత బీమా పై ప్రతి ఒక్కరికి వివరించాలని శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ మేరకు నూతనంగా శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ లో సేల్స్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన జబ్బార్ ఖాన్ ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ఎన్నో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని దీంతో ఆ కుటుంబం నష్టాల్లో కూరుకుపోతుంది అన్నారు. అలాగే జీవిత బీమా ఉంటే వారి కుటుంబానికి ఎంతో ధీమాగా ఉంటుందని అటువంటి అప్పుడు ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించి వారితో భీమా చేయించాలని అన్నారు. చాలామంది బీమా లేకపోవడంతో వారి కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతింటున్నాయని అదే భీమా ఉంటే వారి జీవితంలో ఒక వెలుగు వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాల ఏజి ఎం అట్లా సురేష్, డివిజనల్ మేనేజర్ ఏ వెంకటరాజం, బ్రాంచ్ మేనేజర్ మల్లెత్తుల శ్రీనివాస్ యాదవ్ పలువురు పాల్గొన్నారు.

# పేద ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తాం...

- ఎలిగేడు మండలం శివపల్లి గ్రామం లో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం...
- గతంలో ప్రజలను మభ్యపెట్టి రెండుసార్లు అధికారంలోకి వచ్చి ఇల్లు ఇవ్వకుండా మోసం చేసిన ఘనత బిఆర్ఎస్ పార్టీది...
- కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ప్రజా సంక్షేమ పథకాలను దశలవారీగా అమలు చేస్తున్నాం..
- ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం మడమ తిప్పకుండా ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తున్నాం..
- త్వరలోనే నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ నిర్మాణాలకు మంజూరు:
-పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు:





**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిది**
ఎలిగేడు మండలంలోని శివపల్లి గ్రామం లో శుక్రవారం రోజున నూతన ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గులు పోసి భూమి పూజ నిర్వహించి స్థానిక నాయకులతో కలిసి ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ...
మొదటి విడుతగా ఎలిగేడు మండలంలోని శివపల్లి గ్రామం లో ఇందిరమ్మ ఇండ్లకు శ్రీకారం చుట్టడం జరిగిందని చెప్పారు. త్వరలోనే పెద్దపల్లి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ప్రారంభిస్తామని తెలిపారు. వచ్చే నాలుగేళ్లలో నియోజకవర్గానికి 14 వేల ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసే అవకాశం ఉందని ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో భాగంగా అర్హులైన పేదలకు ఇండ్లను, అలాగే వివిధ సంక్షేమ పథకాలను అందజేస్తున్నట్టు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు మంజూరి కోసం కానీ, బిల్లుల కోసం కానీ దళారులను ఆశ్రయించవద్దని, ఎవరికి కూడా నయాపైసా ఇవ్వవద్దని ఎమ్మెల్యే సూచించారు. లబ్ధిదారుల పట్ల పూర్తి పారదర్శకంగా, అవినీతికి తావు లేకుండా ప్రభుత్వం, అధికారులు వ్యవహరిస్తారని స్పష్టం చేశారు. గతంలో బీ.ఆర్.ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు తరగు పేరిట ఒక క్వింటాలుకు 8 నుంచి 12 కిలోలు కట్ చేసి రైతన్నలను నిలువుదోపిడీ చేశారని కానీ మన ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాను శాసనసభ్యులు ఎన్నికైన తరువాత నుంచి రైతన్నల పంటలో గింజ తరుగు లేకుండా చేసి రైతన్నలకు లాభం చేకూరుస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, ఎం ఆర్ ఓ,ఎంపీవో, అధికారులు కాంగ్రెస్ నాయకులు సమా రాజేశ్వర్ రెడ్డి, దుగ్యల సంతోష్ రావు, జూలపల్లి మార్కెట్ చైర్మన్ గండు సంజీవ్, పుల్లూరి వేణుగోపాల్ రావు,లోక జలపతి రెడ్డి, బొజ్జ శ్రీనివాస్,మాజీ ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి రాంగోపాల్ రెడ్డి,దారబోయిన నర్సింగ్ యాదవ్, కొమ్ము పోచలు, హర్షణపల్లి వెంకటేశ్వర్ రావు, అమ్ముల రాజమల్లు, మెతుకు కాంతయ్య,దుగ్యల రామ్ చందర్ రావు,పొట్యాల శంకర్, సిరికొండ కొమురయ్య, గంగిపెల్లి చొక్కయ్య, రాజరామ్ రెడ్డి, అనంత రెడ్డి, హనుమంత్ రెడ్డి, కుమార్, సంజీవ్, స్వామి, ఈర్ల స్వామి, కనుకుంట్ల అంజి,లబ్దిదారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు మరమ్మత్తుల కారణంగా పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం..

- వీణవంక ట్రాన్స్కో ఏ ఈ సుర్వేశ్వర చారి..

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, మార్చి 7.**



వీణవంక మండల పరిధిలోని వీణవంక, పోతిరెడ్డిపల్లి విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో గ్రామాలైన వీణవంక, నర్సింగాపూర్, లస్మక్క పల్లి, రెడ్డిపల్లి, బ్రాహ్మణపల్లి, శ్రీరాముల పేట, కొత్తపల్లి, అచ్చంపల్లి, కొండపాక, హిమ్మత్ నగర్, పోతిరెడ్డిపల్లి గ్రామాలలో విద్యుత్ సబ్స్టేషన్లలో మరమ్మతుల కారణంగా, మధ్యాహ్నం 3గంటల నుండి 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోదారులు, రైతులు సహకరించగలరని కోరుతూ, వీణవంక ట్రాన్స్కో ఏ ఈ సుర్వేశ్వర చారి ప్రకటనలో తెలియజేశారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి

- మహిళా సాధికారతతో మహిళలు అన్ని రంగాలలో అధిగమించాలి
- జి. భవానీ చంద్ర జిల్లా ప్రధాన న్యాయమూర్తి, చైర్మన్ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సంగారెడ్డి జిల్లా







**కరపత్రం సంగారెడ్డి జిల్లా మార్చి 07,**
జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవానిచంద్ర అధ్యక్షతన,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమమును సంగారెడ్డి జిల్లా కోర్టు సమావేశ ప్రాంగణం నందు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలోజిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.భవానీ చంద్ర మట్లాడుతు అన్ని రంగాలలో మహిళల పాత్ర గొప్పది. మహిళా సాధికారతతో అన్ని రంగాలలో రాణించాలని సందేశం అందిస్తూ ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ,
నేటి సమాజంలో భారత రాజ్యాంగం ద్వారా సంక్రమించిన సమానత్వం సాధికారిత తో మహిళలు అన్ని రంగాలలో పురుషులతో సమానంగా గౌరవం పొందుతున్నారు. కానీ కొన్ని సందర్భాలలో సమాజంలో లైంగిక దాడులు, హత్యాచారాలు, లైంగిక దోపిడీ, వరకట్నం వంటి సమస్యలను వెంటాడుతుంటాయి . వీటిని పరిష్కరించేందుకు మహిళలకు రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయి. మహిళలు సోషల్ మీడియాకు తగినంత దూరంగా ఉండాలి. కొత్త పరిచయాలతో అప్రమత్తంగా ఉంటూ తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. బాల్య వివాహల నిర్మూలపై అవగాహన కల్పిస్తున్నాము. మహిళలకు ఎటువంటి న్యాయం కావాలన్నా కోర్టులో ఉచితంగా న్యాయం పొందవచ్చును అని మహిళలు ధైర్యంతో ముందుకు వెళ్లాలి. మహిళలకు అన్ని రంగాలలో అద్భుత అవకాశాలు కల్పిస్తున్నాయి.వీటిని సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జి.భవానీ చంద్ర , మొదటి అదనపు సెషన్స్ జడ్జి కె.జయంతి, మూడవ అదనపు సెషన్స్ జడ్జిజి.సునీత రవీంధ్ర రెడ్డి, రెండవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి డా.పి.పి.కృష్ణార్జున్, బి.రమేష్,జిల్లా కార్యదర్శి న్యాయ సేవ అధికార సంగారెడ్డి జిల్లా, మహిళ ఉద్యోగులు పాల్గొన్నారు.

# నల్లగోని వీరయ్య కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ యువ నాయకులు కొమ్మిడి రాకేష్ రెడ్డి..

**కరపత్రం వీణవంక,మార్చి 7.**



వీణవంక మండలం ఎలుబాక గ్రామానికి చెందిన నల్లగోని వీరయ్య గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా, అతిధి డెవలపర్స్ అధినేత, కాంగ్రెస్ యువ నాయకులు కోమ్మిడి రాకేష్ రెడ్డి శుక్రవారం వారి కుటుంబ సభ్యులనుపరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ పరామర్శలో జమ్మికుంట మార్కెట్ డైరెక్టర్ సతీష్ గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షులు సంపత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కొండల్ రెడ్డి, ఎలకపల్లి లక్ష్మణ్,సమ్మిరెడ్డి, మద్దుల ప్రశాంత్, పరిపూర్ణ చారి, శ్యామ్, మాడ కొండల్ రెడ్డి, గడ్డం కుమార్ దనియల్, కార్తీక్, శ్రీకాంత్, గణేష్ రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి వెన్నుముక కార్యకర్తలే..

**కరపత్రం ప్రతినిధి, వీణవంక, మార్చి 7.**
వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులుగా రాపర్తి రవి,ప్రధాన కార్యదర్శిగా మునిగాల రాజు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.అనంతరం వారు మాట్లాడుతూ.. వీణవంక మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతంకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలి రాబోవు స్థానిక సంస్థ లో పార్టీ జెండా ఎగురవేయలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, మాజీ అధ్యక్షులు ఎండీ సాహెబ్ హుస్సేన్, నాయకులు, గంగాడి తిరుపతిరెడ్డి, ఈదునూరి పైడి కుమార్, గెల్లు శ్రీనివాస్, మాజీ సర్పంచులు పంజాల సతీష్, పానుగంటి మధుకర్, తాళ్లపల్లి సమ్మయ్య,చేపూరి రాజు, పానుగంటి రాజు, గౌరిశెట్టి రమేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

